ఆమె జీవితమే అతని పాట. ఆ పాటే ఆమె జీవితం. ఆమె రహస్య హృదయ నిధి. నలుగురికీ ఎలా వినిపించగలదు?

నర్మద విశాల వినీల నేత్రాలు తెరిచి సారథివంక చిలిపిగా చూచింది.

ఆమె కళ్ళలోని కాంతులు అతని హృదయంలో కాంతులు వెదజల్లాయ్.

నర్మద పాడింది. అద్భుతంగా పాడింది. శ్రోతలు తన్మయు లయ్యారు. మంత్రరుద్ధ భుజంగాలకుమల్లే నిస్తబ్ధు లయ్యారు.

హాలంతా ఏదో తీయని మాధుర్యంతో నిండి పోయింది. నర్మద పాట ఆపి సభికుల కేసి చూసి చేతులు మోడ్చింది. కరతాళ ధ్వనులతో హాలు దద్దరిల్లిపోయింది. మళ్లా నిశ్శబ్దం ఆవరించింది. హాలు బయట చూరుకింద మాధుర్యం భరించలేనట్లు, నిర్భరానందంతోనన్నట్లు పిచ్చుకలు కువకువ లాడాయి.

ఒక రిద్దరు కుర్రాళ్ళు వన్సుమోరని అరిచారు. సంగీతపు పోటీలు నిర్వహిస్తున్న పెద్దల మొహాలమీద చిరునవ్వు లంకురించాయ్. పోటీ సంఘపు కార్యదర్శి కులుకుతూ, వణుకుతూ లేచి నుంచున్నాడు. సభికుల రసికత్వానికి జోహారులర్పించాడు. పోటీదారులు ఒక పాటకంటే ఎక్కువ పాడడానికి వీలులేదనీ, వన్సుమోర్లు కాలాతీతానికి కారణమవుతాయనీ చెబుతూ మరో పోటీదారుపేరు పిలిచాడు. మళ్లీ ఎవరో పాడడానికి ఉపక్రమించాడు.

శ్రోతల గుంపులో సారథి కూచున్నాడు. నర్మద పాట చెవులకు ఇంకా వినవస్తోంది. అతను ఈ లోకంలో లేడు. నందనవనంలో గంధర్వకన్య పాట వింటున్నాడు. ఏమి పాట అది ? ఎంత గొప్పగా పాడింది ! ఏదో గానామృతస్రవంతిలో ఆతడు తలమునుకలయ్యాడు. మెత్తని, తెల్లని వెన్నెల అతనిని తాకింది మృదువుగా. తెల్లని తెరల లాంటి మబ్బులు మెత్తగా కావిలించుకున్నాయి. ఇదేదో విచిత్రానుభూతి. గంధర్వకన్య అరుణారుణాధరంతో అతని నిశ్శబ్దంగా మృదులంగా చుంబించింది. సుమధుర సుందర లోకానికి నర్మద శ్రోతల్ని ఆహ్వానించింది.

సారథి నిట్టూర్చాడు.

సంగీతపోటీల కార్యక్రమం ముగిసింది. ఎవరో ఉపన్యాసచక్రవర్తి మాట్లాడుతున్నాడు. సంగీతమంటే అలా ఉండాలి, ఇలా ఉండాలి, అని తనకు తోచిన రీతిలో నిర్వచిస్తున్నాడు. తన హాస్యానికి తనే నవ్వుకుంటూ సభికుల్ని బోర్ చేశాడు. కుర్చీలో కూర్చుంటూ తనకు వేసిన పూలహారాన్ని తీసి భద్రంగా ఒడిలో పెట్టుకున్నాడు. అతని ప్రయోజకత్వానికి ప్రతిఫలం పూలహారం.

సారథి నవ్వుకున్నాడు.

ఫంక్షన్ ముగిసింది. బయటకి వచ్చాడు. ప్రతివాడూ నర్మదను మెచ్చుకుంటున్నాడు. ఒకరు లతా మంగేష్కరుతో పోలిస్తే మరొకరు జిక్కీతో పోల్చారు. విమర్శలు వింటూ పార్కువేపు వెళ్ల సాగాడు. నర్మద పాట ఇంకా అతని చెవుల్లో గింగురుమంటోంది.

"రాధికారాధికా
నావేణూదయగీతికా
నాగానామృతవీచికా"...

కృష్ణుడి వలపు పిలుపు.

నర్మద తనకు కొత్తకాదు. గుంటూరులో చదివేరోజుల్లో తన చెల్లెలి క్లాసుమేటు. అడపాదడపా తన చెల్లెలు రమ కోసం ఇంటికి వచ్చేది. కానీ అదేమిటో తను నర్మదను పలుకరించడానికి భిడియపడేవాడు. కళాకారులూ, కవులూ, గాయకులూ అంటే సారథికి చాల గౌరవం. అలాంటి వాళ్ల స్నేహంకోసం అతని హృదయం పరువులెత్తేది. నర్మద బాగా పాడగలదని అప్పుడే తనకు తెలుసు. తరువాత తెలిసిందల్లా స్కూలు ఫైనలు పాసై టీచరుశిక్షణ పొందడానికి వెళ్లిపోయిందని.

సారథి ఎం. ఎ. పాసయ్యాడు. జర్నలిజంలో శిక్షణపొంది కేంద్ర ప్రచారశాఖలో రిపోర్టరుగా చేరాడు. వెళ్లి జాయినయిన వారంరోజుల తరువాత నర్మదను మ్యూజిక్ హాలులో చూశాడు, మొదటిసారి. అప్పుడే ఆమెపాట వినటం జరిగింది. ఆ పాటే అతని హృదయంలో క్షీరసాగర మథనానికి కారణ మయింది. నర్మదను గురించిన ఏదో భావతరంగం తన మనోసాగరంలో పరవళ్లు తొక్కింది.

పార్కులో ప్రవేశించాడు సారథి.

పూలపరిమళం ఆహ్వానిస్తోంది. లైటు వెలుగులో పచ్చని గడ్డి వింతగా మెరుస్తోంది. రేడియోలోంచి కమ్మని సంగీతం వినవస్తోంది. చల్లగాలి హాయిగా వీస్తోంది. పూలమొక్కల పక్కన సిమెంటుబెంచీమీద కూచుని సిగరెట్ ముట్టించాడు. పావుగంట నిశ్శబ్దంగా గడిచింది. రేడియో సంగీతం సారథి వినడంలేదు. మనస్సనే రేడియోలోంచి నర్మదపాట వినిపిస్తోంది.

పరధ్యానంగా కూచున్న సారథి భుజంమీద ఎవరో చేయివేశారు. ఉలికిపడి వెనక్కు తిరిగిచూశాడు. విష్ణుమూర్తి. కాలేజీలో చదివే రోజుల్లో తన క్లాసుమేటు.

"ఆలోచన లేమిటోయ్, హరిణలోచనా" అంటూ సారథి చేతిలోని సిగరెట్ ప్యాక్ అందుకున్నాడు. సిగరెట్ ముట్టించి పొగ గుప్పుమని వదులుతూ—

"ఇవ్వాళ పొద్దున్న వినిపించిన నాటిక రేడియో వాళ్లకి పంపావా" అన్నాడు మూర్తి.

"లేదు. కొంత మార్పు చేయాలి. నాయికీ నాయకులు ఉద్యానవనంలో కాకుండా సముద్ర తీరంలో మొదటిసారి కలుసుకున్నట్లు. ఎంచేతంటే సముద్రపు హోరు విషాదవాతావరణ సృష్టికి సరిగ్గా సరిపోతుంది." ఆలోచిస్తూ అన్నాడు సారథి.

"కావొచ్చు. సాయంకాలం సముద్రపు టొడ్డున కలుసుకోవడంకంటే ఉద్యానవనం సీనే బావుంటుంది. నీ ఇష్టం. నాటిక నీదిగా" అంటూ దూరాన గేటువేపు చూశాడు.

"అమ్మాయిలోయ్." వెన్నెముక నిటారుగా సాగించి కూచున్నాడు విష్ణుమూర్తి.

మూర్తి అవస్థ చూసి సారథి చిరునవ్వు నవ్వాడు. గేటువేపు చూశాడు. అతని గుండె జల్లుమంది. నర్మద, మరో అమ్మాయి— మూర్తి, తనూ కూచున్న వేపే వచ్చారు.

సారథి సర్దుకుని కూచున్నాడు.

అతనివేపు చూసింది నర్మద. కళ్లతో ప్రశ్నించింది. మూర్తిని చూసి ముందుకు వెళ్లిపోయింది.

వాన వచ్చి వెలసినట్లయింది. ఒక్క సారిగా విద్యుద్దీపాలు వెలిగి మళ్లీ ఆరిపోయినట్లయింది.

విష్ణుమూర్తి నవ్వాడు. కారణంలేని నవ్వు. సారథి అనుమానించాడు. చిరాకు, చిరుకోపం వచ్చాయ్.

"ఏమిటి నవ్వుతున్నావ్" అన్నాడు సారథి మొహం చిట్లించి, చిరాగ్గా.

"ఇప్పుడు వెళ్లిన అమ్మాయిని గురించే" అన్నాడు తాపీగా మూర్తి.

"ఎవరూ ? నర్మదా. చంపావ్ బాబూ. నీదృష్టి ఆ అమ్మాయిమీదకూడా పడింది కాబోలు. ఏమిటి విశేషాలు ?" క్యూరియాసిటీ, కుతూహలం. సారథి రెండు కళ్లల్లోనూ కనిపించాయ్ మూర్తికి.

"ఆ అమ్మాయిని గురించి బోలెడు విన్నాన్లే! పూర్తిగా రూమర్, వదంతి అని కొట్టి పారెయ్యడానికి వీలులేదు. పరిస్థితులలా ఉన్నయ్" సీరియస్‌గా మొహం పెట్టి అన్నాడు మూర్తి.

సారథికి అర్థమయింది. అపవాదు. నింద. స్కాండల్. అసహ్యం వేసింది.

ఆలోచించాడు. నర్మదది తన ఊరే కదా. తనకు తెలియని విశేషాలు మూర్తికేం తెలును ?

"నీ మొహం" అంటూ మూర్తివేపు చూసి లేచాడు. ఇద్దరూ హొటలువేపు బయలుదేరారు.

సిమెంటురోడ్డు మీదుగా వెళ్తూంటే పక్కనే ఉన్న గార్డెన్‌లోంచి పూల పరిమళంతో గాలి చల్లగా వీస్తోంది. చర్చి దాటారు. ఆడపిల్లల

— [illegible]

# జీవితగీతం

టి. రాఘవేంద్రరావు



హోన్సులు. ఏదో రణగొణధ్వని. సినిమా థియేటరు, బస్సు స్టాండు దాటి హోటల్‌లోకి ప్రవేశించారు. సారథి లోపలికెళ్లి భోజనం చేసి వచ్చేదాకా బయట కూచున్నాడు మూర్తి, రేడియో వింటూ. భోజనం అయ్యాక సారథీ, మూర్తి ఇంటికి బయలుదేరాడు. సారథి మనస్సులో నర్మదనుగురించి మూర్తి ఏమి చెబుతాడో వినాలని ఉంది.

మూర్తి సారథిని మేడమీద గదిలో కూచోబెట్టి భోజనం చెయ్యడానికి కిందకు దిగి వెళ్లాడు.

గదిలో బాగా వేడిగా ఉంది. ఉక్కబోస్తోంది. కిటికీ తెరవాలన్న ఆలోచన కలుగలేదు సారథికి. ఏదో పుస్తకం చూస్తూ కూచున్నాడు. మనస్సెదోలా ఉంది. పేజీలు తిప్పుతూ ఉన్నాడు.

మూర్తి భోజనంచేసి పైకి వచ్చాడు. ఇద్దరూ గది బయటికి వచ్చి డాబామీద కుర్చీల్లో కూచున్నారు. విష్ణుమూర్తి చెప్పసాగాడు.

సారథి సిగరెట్ ముట్టించాడు.

"ఈ ఊళ్లో ఒక యువజన సమాజం ఉంది. స్త్రీలుకూడా సభ్యులుగా ఉన్నారు. సమాజ స్థాపనలోని ఉద్దేశ్యం గ్రామాభ్యుదయానికి, పతిత స్త్రీజనోద్ధరణకు కృషి చెయ్యడం. సభ్యుల్లో ఒక లెక్చరరు ఉన్నాడు. అందమైనవాడు. సంగీత ధోరణీ, నటనా చాతుర్యమూ ఉన్నవాడు. మంచి వక్త. సమాజం నాటకాలు వేస్తే ఈ లెక్చరరు దర్శకత్వం వహిస్తాడు" విష్ణుమూర్తి గొంతు సవరించుకున్నాడు.

మరో సిగరెట్ ముట్టించి "అసలు విషయం ఏమిటంటే నర్మదకు, ఆ లెక్చరరుకూ మధ్య ఏదో వ్యవహారం నడుస్తోందన్ని వదంతి" అని ముగించి ఊరుకోలేదు అంతటితో మూర్తి.

"ప్రేమ వ్యవహారంలోయ్. అదే అయి ఉంటుంది." అని తేల్చి చెప్పాడు న్యాయమూర్తి ధోరణిలో, ఈ రహస్యం లోకోద్ధరణకోసం చెబుతున్నట్లు.

సారథి మనస్సు చివుక్కుమంది.

ఎంత తేలిగ్గా మనుష్యుల శీలంమీద దుమ్మెత్తిపోస్తోంది లోకం ? అది వాళ్ల హృదయాలలో రేపే మానని గాయాలనుగురించి ఆలోచించదు.

విష్ణుమూర్తి దగ్గర సెలవు తీసుకుని వెళ్లిపోయాడు తనరూముకు, ఆ చీకట్లో సారథి.

*　　*　　*

రోజులు దొర్లుతున్నయ్.

ఆఫీసుపనుల్లో నిమగ్నుడయ్యాడు సారథి.

ఓ రోజు ఉదయం సారథి ఆఫీసులో ఉండగా కృష్ణమూర్తిగారు ఫోనుచేశారు.. సాయంత్రం తనను కలుసుకోమని. కృష్ణమూర్తిగారు బెజవాడనుంచి వచ్చారు. వారికి ముడిఇనుము వ్యాపారంలో పెద్ద వాటా ఉంది. సారథిని చూడాలని వారి కోరిక. సారథి నాన్నగారూ, కృష్ణమూర్తిగారూ బాల్యస్నేహితులు.

ఆ సాయంత్రం సారథి కృష్ణమూర్తిగారిని కలుసుకున్నాడు. ఆప్యాయంగా పలుకరించి హోటలుకు తీసుకెళ్లాడు.

## జీవితగీతం

"శేషాచలపతి కూతురు నర్మద ఈ ఊళ్లో ట్రయినింగ్ చదువుతోందిట. నీకు తెలుసా" అన్నారు కృష్ణమూర్తిగారు, కాఫీ త్రాగుతూ.

సారథి మనోసాగరంలో మధుర భావ తరంగం ఉవ్వెత్తుగా లేచింది. కాఫీకప్పు టేబుల్‌మీద పెడుతూ సర్దుకుని కూచున్నాడు.

"ఓసారి చూశాను" అన్నాడు, పైకి ఏమీ ఇంటరెస్టు లేనివాడల్లే.

"ఆ అమ్మాయిని చూడాలోయ్. లేకపోతే శేషాచలపతి బాధపడతాడు. నా దగ్గర ఆ అమ్మాయి అడ్రసు కూడా ఉంది" అన్నారు కృష్ణమూర్తిగారు.

నర్మద పరిచయం కావాలని సారథి మనస్సు గాఢంగా వాంఛిస్తోంది. తీరా కృష్ణమూర్తిగారు వెళ్దామన్నాక సారథి మనస్సు వెనుకంజ వేసింది.

> ఉపాధ్యాయుడు—ఒరేయి కొండన్నా నూనె అంటే హిందీలో ఏమంటార్రా ?
>
> కొండన్న—తేల్ సార్.
>
> ఉపా—రామూ, నెయ్యిని ఏమంటార్రా ?
>
> రాము—పాము సార్.
>
> వై. సూర్యనారాయణరెడ్డి (గుత్తి)

ఎలా పలుకరించాలి ? ఏముంది మాట్లాడడానికి ? అతని హృదయంలో ఎన్నో ప్రశ్న లుదయించినై.

తన మనస్సులోని ఆందోళనను పైకి కనపడనివ్వకుండా కృష్ణమూర్తిగారిని అనుసరించాడు సారథి. అవ్యక్తానందం ఏదో అతని మనస్సును అలలు, అలలుగా ఆవరించుకుంది.

నర్మద యింటిని సమీపించారు. సారథి గుండె వేగంగా కొట్టుకొంటోంది. కొన్నిరోజుల క్రితం మ్యూజిక్‌హాల్లో నర్మద పాడిన పాట జ్ఞాపకానికి వచ్చింది.

వాకిట్లో ఇద్దరినీ చూసి ఆశ్చర్యపోయింది నర్మద. కుర్చీలో కూచుని పేపరు చూస్తోందల్లా లేచి దగ్గరగా వెళ్లి ఆహ్వానించింది.

కూచోడానికి కుర్చీలు చూపించి లోపలకెళ్లింది. మరో రెండు నిమిషాల్లో ఫ్లాస్కులోని కాఫీ రెండు కప్పుల్లో తీసుకువచ్చి ఇద్దరికీ చెరో కప్పు అందించింది.

కాఫీ త్రాగుతూ కుశల ప్రశ్నలు వేశారు కృష్ణమూర్తిగారు. సమాధానాలు చెబుతూ అప్పుడప్పుడు సారథివేపు చూస్తూ నుంచుంది నర్మద. సారథి ఇబ్బందిపడసాగాడు, ఆమెతో సంభాషణ ఎలా మొదలుపెట్టాలో తెలీక.

ముందు నర్మదే పలుకరించింది.

"రమ ఎలా ఉందండీ ?" సారథివేపు చూసింది. ఆమెకళ్లు వింతగా మెరిశాయ్.

"బావుంది" ముక్తసరిగా అన్నాడు సారథి. తన సంభాషణ తనకే అసహజంగా తోచింది. ఏదో ఆత్మీయత లోపించింది.

నర్మద కృష్ణమూర్తిగారితో మాట్లాడే సమయాల్లో ఆమెవేపు దీక్షగా చూస్తూ కూచున్నాడు సారథి. అంత దగ్గరగా ఇదివరకెప్పుడూ ఆమెను చూడలేదు.

తెల్లని జార్జెటుచీర కట్టుకుంది. నల్లని షిఫాన్ చోళీ వేసుకుంది. ఎర్రగా, సన్నగా, నాజూగ్గా ఉంది నర్మద. నల్లని నొక్కుల జుట్టు, వింతకాంతితో మెరిసే కళ్లు సారథిని సన్నిటి జలకమాడించినై. విస్తుపోయాడు. ఆమె చుట్టూ ఏదో వింత కాంతిని చూశాడు. ఆ కాంతి పుంజంమధ్య ఊర్వశిలా మెరుస్తోంది. బేలూరు దేవాలయంలో తను చూసిన మదనిక అని పిలువబడే శిలాబాలిక జ్ఞాపకానికివచ్చింది. ఆమెను చూస్తూ వేసవికాలంలో హంపీ దగ్గర తుంగభద్ర చల్లని నీళ్లల్లో స్నానం చేస్తున్న వాడికిమల్లే ఆహ్లాదకరంగా ఫీలయ్యాడు సారథి.

వెళ్లడానికి లేచారు కృష్ణమూర్తిగారు. సారథికి కాస్సేపు ఉండాలని ఉంది. విధిలేక లేచాడు. వాకిటిదాకా వస్తూ సెలవు తీసుకుంది నర్మద.

సారథివేపు చూసి "మరోసారి ఎప్పుడేనా తీరిక ఉంటే రండి" అంటూ అతని కళ్లల్లోకి చూసి చప్పున కళ్లు కిందకు వాల్చింది.

"అలాగే" అంటూ కృష్ణమూర్తిగారితో కలిసి బయటికి వచ్చాడు. సెలవుతీసుకుని రూముకేసి వెళ్లాడు సారథి.

*　　*　　*

ఆరోజు మొదలుకొని హోటల్లో, పార్కులో ఎక్కడ రేడియోలో సంగీతంవిన్నా నర్మద జ్ఞాపకానికి వస్తోంది. రోజులు గడుస్తున్నయ్. ప్రచార శాఖలో ఉద్యోగమూ, కథలూ, నాటికలు రాయడమూ, ఇలా గడుపుతున్నాడు సారథి కాలాన్ని.

ఆరోజు ఆదివారం ఉదయంలేచి స్నానం ముగించి హోటలుకు బయలుదేరాడు. కాఫీ త్రాగుతూ కూచున్నాడు. హఠాత్తుగా నర్మద తాలూకు జ్ఞాపకాలు అతని మనస్సు నాక్రమించుకున్నై. నిరుత్సాహపడ్డాడు సారథి. విష్ణుమూర్తి చెప్పిన విషయాలు అతని హృదయాన్ని కెలుకుతున్నై. బాధపడ్డాడు. ఆ నిందను ఎలా నమ్మటం ? ఆరోజు తను చూసిన నర్మదరూపం కళ్ళముందు మెదిలింది. ఎవరో గొప్పశిల్పి చెక్కిన పాలరాతివిగ్రహంలా సౌందర్యాన్ని, కాంతినీ విరజిమ్ముతూ, అమాయకంగా నుంచున్న నర్మద జాలిగా తన వేపు చూసినట్లు ఫీలయ్యాడు.

వీలయినప్పుడల్లా తన ఇంటికేసి వస్తుండమని ఆహ్వానించింది ఆరోజు నర్మద. అది తలుచుకుని ఉత్తేజితుడయ్యాడు.

(61-వ పేజీ చూడండి)

నర్మద ఇంటివేపు బయలుదేరాడు. సిగరెట్ కాలుస్తూ, సిమెంటురోడ్డుమీద పార్కుపక్కగా వెళ్తూంటే ఉత్సాహంగా ఉంది. హాయిగా, చల్లగా గాలి వీస్తోంది. అలా ఓ మైలుదూరం నడిచి నర్మద ఇంటిని సమీపించాడు.

వసారాలో బట్టలు ఆరవేస్తూ నుంచున్న నర్మద కనిపించింది. సారథిని చూసింది. ఆమె మొహం విప్పారింది. జారిపోతున్న పమిట సర్దుకుని సారథిని ఆహ్వానిస్తూ లోపలకు దారి తీసింది.

నర్మద ననుసరించాడు సారథి. అందమయిన ఆమె భుజాలు, వీపూ, సన్నని నడుమూ ఆకర్షవంతంగా కనిపించాయ్ సారథి కళ్ళకు. ఈ ఊహకు చకితుడయ్యాడు. తన మనస్సులో ఎన్ని ఊహలున్నై ఏ. ఇవన్నీ నర్మదకు తెలిస్తే ?

కుర్చీ చూపించింది నర్మద. ఆసీనుడయ్యాడు సారథి. లోపలకెళ్ళి కప్పులో కాఫీ తీసుకువచ్చింది. కాఫీ కప్పు అందుకునేటప్పుడు ఆమె సన్నని, నాజూకయిన వ్రేళ్ళు తగిలాయ్. అతని మనస్సుదోలా అయింది. ఏదో పనుండి లోపలి కెళ్ళింది నర్మద.

చుట్టూ చూశాడు, సారథి. గది నిరాడంబరంగా ఉంది. గదిగోడలకు నాలుగైదు ఫోటోలు తగిలించబడి ఉన్నయ్. దగ్గరే ఓ టేబుల్, దానికి కాస్త పైగా హోల్షెల్ఫు. బల్లమీద, షెల్ఫులో ఎన్నో పుస్తకాలున్నై ఏ. ఇవన్నీ నర్మద చదువుతుందా ? బల్ల మీద రెండు, మూడు ఇంగ్లీషు నవలలు పడివున్నై ఏ. పరిశీలనగా చూశాడు. ప్రయిడ్ అండ్ ప్రిజుడీస్, నానా మొదలైన పుస్తకాలు, అప్పుడుకాని సారథికి తోచలేదు. నర్మదతోబాటు ఇంకా ఎవరైనా ఉంటున్నారా ? తెలుసుకోవాలన్న కుతూహలం ఎక్కువయింది.

సారథి కూచున్న గదిలోకి వచ్చింది నర్మద. దూరంగా ఓ కుర్చీలో కూచుంది. నర్మదకేసి చూశాడు. ఆమె తనవేపు చూస్తోంది. ఇద్దరికళ్ళూ కలుసుకున్నయ్. మెరపు మెరసినట్లయింది. సర్దుకున్నాడు సారథి.

“మీరొక్కరే ఉంటున్నారా” అడిగాడు సారథి.

“లేదండీ. మరో అమ్మాయి ఉంటోంది. కాలేజీలో బి. యే. చదువుతోంది. ఆ పుస్తకాలన్నీ ఆ అమ్మాయివే” అంది బల్లమీది పుస్తకాలవైపు చూపించి. “నానా” అన్న పుస్తకంమీది ముఖచిత్రం సారథిని వెక్కిరించింది. చిరుగాలికి టపటపా కొట్టుకున్నయ్ పుస్తకంలోని పేజీలు.

కాసేపు నిశ్శబ్దం తాండవించింది.

“మిమ్మల్ని ఈఊళ్ళో ఓసారి చూశానని రమకు ఉత్తరం రాశాను” అన్నాడు సారథి.

ఆమెమొహంలో ఆశ్చర్యం గోచరించింది.

“చిత్రం. చూశారా, నేనూ అలాగే రాశాను. రెండు ఉత్తరాలూ రమకు చేరిఉంటై” అంది.

సారథి గతుక్కుమన్నాడు. రమ ఏమని ఊహించి ఉంటుందోనని ఆలోచించసాగాడు.

అతని మనస్సులోని ఆలోచనల్ని గుర్తించిన దానికి మల్లే “మళ్ళీ చిన్నతనంలోని రోజులూ, హైస్కూల్లో రమతోబాటు చదివిన రోజులూ జ్ఞాపకానికి వస్తున్నయ్” అంది.

# జీవితగీతం

(10వ పేజీ తరువాయి)

సారథి నవ్వాడు. మునుపు నర్మదతో మాట్లాడ డానికి బిడియపడ్డ సారథిహృదయంలోని సిగ్గూ, భయం తొలగిపోయ్యాయ్. మామూలుగా, సహజంగా నర్మదతో సంభాషణ కొనసాగించగలుగుతున్నాడు.

“నాకు బాగా జ్ఞాపకం. ఓసారి నేను నా గదిలోకి వచ్చేసరికి మీరూ, రమా మా ఇంట్లో నా పుస్తకాల బీరువాదగ్గరనుంచుని పుస్తకాలు చూస్తున్నారు. నన్ను చూసి తడబడి పుస్తకం కిందపడేశారు. రమ బిగ్గరగా నవ్వింది” అన్నాడు సారథి. పూర్వం ఎప్పుడో జరిగినవిషయాలు జ్ఞాపకం చేసుకుంటూ.

నర్మద పకపకా నవ్వింది. వెన్నెల కాసినట్లు, విద్యుద్దీపాలు వెలిగినట్లు, పాలరాతి కొండల్లో గలగల శబ్దంచేస్తూ, నర్మదానది ప్రవహిస్తున్నట్లు నర్మద నవ్వింది.

ప్రసంగవశాత్తూ ఒకరు మరొకరితో “చేతులు కాలాక ఆకులుపట్టుకొని ఏమి ప్రయోజనం?” అన్నాడు.

అతడు పరధ్యానంగా “నీళ్లు ముట్టుకుంటే బొబ్బలు ఎక్కుతాయి కనుక” అన్నాడు.

—ఎం. వెంకటశాస్త్రి (వసంతవాడ)

నవ్వినప్పుడు నర్మద మొహంలో ప్రజ్వరిల్లిన కాంతి పుంజాన్ని, నైర్మల్యాన్నీ, స్వచ్ఛతను, అమాయకత్వపు వెలుగును చూసి, అనుభవించి, నిర్ఘాంతపోయాడు సారథి.

ఇలాంటి నిర్మలమూర్తి నర్మదమీద విష్ణుమూర్తిలాంటి వాళ్ళు ఎలాంటి నిందలు మోపుతున్నారు ? తలుచుకుని కుమిలాడు సారథి.

ఇవన్నీ కొన్ని క్షణాలలో సారథి హృదయసాగరంలో ఉవ్వెత్తుగా లేచిన భావ తరంగాలు.

“అవును. నాకు బాగా జ్ఞాపకం ఉంది. మీ రచనల పైలుకోసం వెతుకుతున్నాము రమా, నేనూ” అని ఊరుకుంది నర్మద.

జీవితంలో హాయి, ఆనందం, ఆహ్లాదం ఏదైనా ఉంటే అదిప్పుడనుభవించ సాగాడు సారథి. ఆరోజంతా నర్మదతో మాట్లాడుతూ కూచుంటే?

నిర్లిప్తంగా, నిరుత్సాహంగా లేచాడు సారథి వెళ్ళడానికి.

నర్మద లేచి నుంచుని “మరో విషయం చెప్పాలి. మరిచిపోయాను. రేపు సేవాసమాజం వాళ్ళు గురజాడ వర్ధంతి సందర్భంలో నాటకం వేస్తున్నారు. మీరు, రాకూడదూ ? సుందర శివరావు దర్శకత్వం వహిస్తున్నారు” అంది నర్మద.

ఇదేమిటి ? ఇదేదో ఉప్పెనలా ముంచుకొస్తోంది. ఈ పరిచయం మరింత దృఢతరం కావాలని వాంఛిస్తోందా నర్మద ? సుందరశివరావెవరు ? లక్ష ప్రశ్నలుదయించినై. కాని ఆక్షణంలో కారు మేఘాలకు మల్లే విష్ణుమూర్తి నాటిన అనుమానం సారథి హృదయాకాశాన్నలుముకుంది. సర్దుకున్నాడు సారథి. నర్మద కళ్ళల్లోకి చూశాడు. ఆమె కళ్ళల్లో అమాయకత్వపు నిర్మలకాంతులు ఉజ్వలంగా ప్రకాశించాయ్.

“వీలయితే వస్తాను తప్పకుండా” అన్నాడు సారథి తడబడుతూ, ఏమీ తోచక.

“అలాకాదు. మీరు వచ్చితీరాలి. మరో కోరిక. మీరోపాట రాసుకురావాలి. నేను పాడతాను. నేను నాటకంలో పాల్గొనడంలేదు. రంగానికి, రంగానికీ మధ్య విరామ కాలంలో పాటలు పాడటమే నా పని” అంది నర్మద. ఒక్కబిగిని ఉపన్యాస ధోరణిలో చెప్పింది. సారథిని మధ్యలో మాట్లాడనివ్వలేదు.

సారథి కదలబోయాడు.

“నాటకం క్రౌను హాల్లో. సరాసరి గ్రీను రూములోకి వచ్చేయండి. అక్కడ మీకోసం వెయిట్ చేస్తుంటాను” అంటూ సారథితోబాటు వసారాదాటి బయటికి వచ్చింది నర్మద.

సెలవుతీసుకుని రూముకేసి వెళ్ళాడు సారథి.

అతని హృదయం పిల్ల తెమ్మరకు కదిలే అలలతో ప్రవహించే సెలయేరయింది. చిరుగాలికి అటూ, ఇటూ ఊగే పూలమొక్క అయింది. ఇంద్రధనుస్సు అలంకరించిన ఆకాశం అయింది.

సారథి ఇంతవరకూ నర్మదస్నేహాన్నే వాంఛించాడు. స్నేహాన్ని మించిన దివ్యసాన్నిహిత్యం ఏదో బలవత్తరంగా పరిణమించి తనను ఆమె వేపు లాగుతోంది. కానీ లోక దృష్టి అతన్ని వెనక్కు లాగింది. నర్మదతో తా నిలా స్నేహంగా ఉండటం విష్ణుమూర్తిలాంటి నిందారోపకచక్రవర్తులకు అభాండాలు వెయ్యటానికి వీలు కలుగ చేస్తోంది. లోకంలో ఒంటరిగా జీవిస్తున్న నర్మదలాంటి అమ్మాయిల జీవితప్రవాహం సాఫీగా ప్రవహించదు. ఒడిదుడుకులతో కూడుకొని ఉంటుంది. అప్పుడు జ్ఞాపకానికి వచ్చింది. నర్మద తనను ఓపాట రాయమని కోరింది. సారథి హృదయం ఆవేశపూరితం అయింది.

ఓ గులాబీపువ్వుంది. మామూలు గులాబీకి మల్లే, దీనికి ముళ్ళులేవు. లోకుల క్రూరదృష్టి నుండి తనను కాపాడుకోవటం కష్టమయింది. దైవంమీద భారం వేసింది. సౌశీల్యం అనే కాంతిపుంజాన్ని తన చుట్టూ నిర్మించుకుంది. ఆ కాంతిపుంజానికి భయపడి లోకులు దూరంగా పోయారు. అదే అర్థం స్ఫురించేలా ఓ పాట రాశాడు.

అతని హృదయంలో బద్ధమైన అగ్నిపర్వతం శాంతించింది. ఉన్నత పర్వతశిఖరంనుండి మహా

వేగంతో ప్రవహిస్తున్న నది మైదానప్రాంతంలో వహించిన ప్రశాంతత్వానికి మళ్లే అతని హృదయం ప్రశాంతపూరితం అయింది.

సారథి విచిత్రమయిన నిర్ణయానికి వచ్చాడు. తను నాటకానికి వెళ్ళడు. నర్మదను మళ్ళీ చూడడు. ఆమె ప్రశాంత జీవితంలోకి ఒక మహో ఉధృతతరంగానికిమల్లే ప్రవేశించడు.

మర్రోజు ఉదయం ఆ పాటను పోస్టు చేశాడు నర్మద విలాసానికి.

* * *

పదిహేను రోజులు గడిచాయ్.

# జీవితగీతం

అతి కష్టంమీద సారథి తన్ను తాను సంబాళించుకున్నాడు. నర్మద సుతిమెత్తని చిత్తాన్ని నొప్పించాడు. ఆమె హృదయాన్ని గాయపరిచాడు. మరోవిధంగా ఆలోచిస్తే తను చేసినపని మంచిదే అనిపించింది.

ఆఫీసు పనిలో నిమగ్నుడయ్యాడు. నిరంతరావేశం ఏదో అతన్ని కదిలించసాగింది. ఆ వేడిలో రెండు, మూడు కథలు రాశాడు. ఆవేశం కొస్త తగ్గినట్లు తోచింది. మళ్ళీ మామూలుగా ప్రశాంతమయిన సాయంత్రాలు పార్కులో గడుపసాగాడు.

ఓరోజు ఉదయం సారథికి ఉత్తరం వచ్చింది. నర్మద రాసింది. అతని గుండె వేగంగా కొట్టుకో సాగింది. చదివాడు.

"మీ పాట పోస్టు ద్వారా అందింది. నా మనస్సదోలా అయింది. మీరు నాటకానికి రారని అర్థమయింది. నేనేం నేరం చేశానని ? పోనివ్వండి. మీ పాట నా జీవితపథాన్ని మార్చివేసింది. ఎంత గొప్పపాట రాశారు.

నేనా రోజు నాటకానికి వెళ్ళలేదు. ఇక జీవితంలో అలాంటి కార్యకలాపాలలో పాల్గొననేమో.

మరో సంగతి. రెండు రోజులక్రితం స్కూలుకు వెళ్తూ, కారుకిందపడ్డాను. ప్రమాదం తప్పింది. కొన్ని చిన్నగాయాలతో బయటపడ్డాను. హాస్పిటలులో ఉన్నాను. మీ పాదాలకు నమస్కృతులు"

చకితుడయ్యాడు సారథి. తన పాదాలకు సమస్కారాలెందుకు ?

సారథి బాధపడ్డాడు. ఆమె తననుంచి మాలిన్యంలేని మహత్తరస్నేహాన్ని కోరింది. తను ఆమె మనస్సును నొప్పించాడు. ఆమెను చూడాలి.

ఆ మధ్యాహ్నంహొటల్లో భోజనంసహించలేదు. సాయంత్రం హాస్పిటల్‌వేపు వెళ్ళాడు. కాంపౌండులోకి అడుగు పెట్టాడు.

హాస్పిటలు తెల్లటిగోడలు సాయంత్రం నీరెండకు మెరుస్తున్నయ్. పక్కనేఉన్న పొలాలమీది నుంచి నిర్మలమ్మైన గాలులు వీస్తున్నయ్. ఆకాశం ఎర్ర రంగు పూసుకుంది. తెల్లటి మబ్బులు పసిడి అంచుల్తో మెరుస్తున్నయ్.

సమస్త ప్రకృతి నర్మద హృదయ వైర్మల్యాన్ని చాటుతున్నది" అనిపించింది సారథికి.

విచారించి నర్మదఉన్న వార్డులోకి వెళ్ళాడు. సారథినిచూసి లేచి కూచుంది నర్మద. ఆమెకళ్ళు సంతోషంతో మెరిసినై. హృదయం ఆనందభరితం అయింది. చూపులు కృతజ్ఞతాభావస్ఫోరకాలయ్యాయ్.

ఆమె మొహంలోని మార్పును గుర్తించాడుసారథి.

ఆమెతలకు కట్టు కట్టారు.

పక్కనే కూచున్నాడు. పడక పక్కనేఉన్న కిటికీ కర్టెన్ లాగింది. కిటికీలోంచి చూశాడు. నీరెండలో పచ్చని పొలాలు మెరుస్తున్నయ్. ప్రశాంత వాతావరణం ఆహ్లాదకరంగావుంది.

సారథే మొదట పలుకరించాడు.

"క్షమించండి. నాటకానికి రావడానికి వీలులేకపోయింది. మీరెందుకు మానేశారు" అన్నాడుసారథి.

నర్మద చిరునవ్వు నవ్వింది.

"మీపాట నా రహస్య హృదయనిధి. నలుగురికీ ఎలా వినిపించను. అందుకనే జీవితమంతా నాకు నేనే ఆపాట పాడుకుంటూ గడిపేస్తాను. నా జీవితమే ఆ పాట. ఆపాటే నా జీవితం"తీయని ఆవేశం ఆమెను ఆవహించింది. కాసేపు కళ్ళు మూసుకుంది. మళ్ళీ విశాల వినీలనేత్రాలు తెరిచి సారథి వేపు చిలిపిగా చూసింది.

ఆమె కళ్ళల్లోని కాంతులు సారథి హృదయంలో వెన్నెల కాంతుల్ని వెదజల్లాయ్.

అప్రయత్నంగా ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు. ఆమె కళ్ళు అశ్రుపూరితాలయ్యాయ్. సారథి హృదయం ఆనందగీతం పాడింది.


ఆయుర్వేదౌషధములు.

శాస్త్రీయముగాను.నమ్మకముగాను తయారుచేయు సంస్థ

వేంకటేశ్వర ఆయుర్వేదనిలయం.

చింతలూరు

ఆలమూరు పోస్టు ★ తూర్పుగోదావరిజిల్లా.

ఆంధ్రదేశమందంతటను బ్రాంచీలు, ఏజన్సీలు కలవు.

[illegible] బజారు, మద్రాసు-1.

PAKCO పాక్కో స్లో-స్పీడ్, కోల్డు స్టార్టింగ్ క్రూడ్ ఆయిల్ ఇంజనులు

—: ప్రత్యేక లక్షణములు :—

* పనిచేయ ప్రారంభించుట తేలిక
* తక్కువ ఇంధన ఖర్చు
* క్రమమైన నడక
* దిట్టమైన నిర్మాణం
* ఎక్కువ మన్నిక
* అద్భుతంగా పనిచేయును
* బాస్ ఫ్యూయల్, ఇంజక్షన్ పరికరములు



మద్రాసు, ఆంధ్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రములకు ఏజెంట్లు :

Grams: LAMP
Phone: 8617

K. S. SHIVJI & CO, (Estd 1903)

పోస్టుబాక్సు నెం. 5, 178-79 బ్రాడ్వే, మద్రాసు-1



సుఖజీవిత సేవ

భారతి "సిద్ధ వైద్య మహిమ" మన దేశ సిద్ధుల సాటిలేని కీర్తికి ఒక తార్కాణము.

"మేల్ మాయిల్ మందు"

ప్రపంచములో ప్రఖ్యాతి గాంచిన మేహ, కుష్ఠరోగనివారిణి

భయంకరమైన మేహ వ్యాధివల్ల కష్టపడువారలకు పునర్జన్మమిచ్చు అద్భుత సంజీవి మేహరోగ నివారణ మాత్రలు, లేహ్యము.

డా॥ కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారి & సన్సు

5/22, మేల్ మాయిల్ (P. O.) (N. A. Dt.) S. India.